ఆదాయం ఉన్నా అభివృద్ధి సున్నా..

- నిలువ నీడ లేక ప్రయాణికుల అవస్థలు
- నిరుపయోగంగా కాలిబాట వంతెన
- ప్రయాణికులు పెరుగుతున్నా బోగీలు అంతే



సామర్లకోటలో నిలువ నీడలేని ప్లాట్‌ఫాం

సామర్లకోట: సామాన్య ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించడంలో అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారని రైల్వే ప్రయాణికులు అంటున్నారు. స్థానిక రైల్వే స్టేషన్‌లోని ప్లాట్‌ఫాంలకు సరైన షెడ్లు లేక ఎండకు, వానకు ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఒకే కాలిబాట వంతెన ఉండటంతో ఎక్కడికో వెళ్లి ఎక్కలేక పట్టాలు దాటి వెళ్లడానికే ప్రయాణికులు ప్రాధాన్యం ఇస్తున్నారు. కాకినాడకు వెళ్లాలంటే ప్రతి ఒక్కరూ సామర్లకోటలోనే రైలు దిగాల్సి ఉంటుంది. అలాగే మెట్ట ప్రాంతాలైన జగ్గంపేట, పెద్దాపురం నుంచి, ఏజెన్సీ ప్రాంతాలు ఏలేశ్వరం, గోకవరం, మారేడుమిల్లి, వై.రామవరం తదితర ప్రాంతాల ప్రజలు హైదరాబాద్, విశాఖలవైపు వెళ్లాలన్నా సామర్లకోట రైల్వే స్టేషన్‌ను ఆశ్రయించాల్సి ఉంటుంది. నిత్యం సుమారు 9 వేల మంది రిజర్వేషన్లు, 25 వేల వరకు సాధారణ బోగీలలో ప్రయాణిస్తుంటారు.

ఈ స్టేషన్ మీదుగా 36 ఎక్స్‌ప్రెస్ రైళ్ల రాక పోకలు సాగిస్తుంటాయి. ప్రయాణికుల సంఖ్య పెరుగుతున్నా, వారికి అనుగుణంగా బోగీల సంఖ్య పెంచకపోవడం శోచనీయమం. ప్రతి ఎక్స్‌ప్రెస్‌కు కనీసం నాలుగు సాధారణ బోగీలు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఏళ్లు గడుస్తున్నా సౌకర్యాలు కరువే



సాధారణ ప్రయాణికులు వేచి ఉండేందుకు షెడ్లు లేవు. ప్రస్తుత వర్షాల వల్ల తడి చేతులతో బోగీలు ఎక్కితే జారిపడే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి షెడ్లు ఏర్పాటు చేయాలి.

– ఘంటశాల సత్యమణిదీప్, ప్రయాణికుడు

అమృత భారత్ స్టేషన్‌గా గుర్తింపు



కోవిడ్‌కు ముందు నియమించిన 12 మంది పారిశుద్ధ్య కార్మికులను ఆరుకు కుదించారు. దీనివల్ల పారిశుద్ధ్య లోపం తలెత్తుతోంది. ఈ స్టేషన్‌ను అమృత భారత్ స్టేషన్‌గా గుర్తించారు. దీంతో ప్లాట్‌ఫాంలపై షెడ్లు, రెండో కాలిబాట వంతెన, లిఫ్టు వచ్చే అవకాశం ఉంది. రిజర్వేషను ప్రయాణికుల ద్వారా నెల 50 లక్షలు, సాధారణ ప్రయాణికుల ద్వారా నెలకు రూ.1.3 కోట్లు ఆదాయం వస్తుంది. నిత్యం 8 నుంచి 10 వేల మంది ప్రయాణిస్తారు.

– ఎం.రమేష్, స్టేషన్ మేనేజర్, సామర్లకోట

క్లుప్తంగా

రైల్వే సిగ్నల్ వ్యవస్థ తనిఖీ



సామర్లకోట స్టేషన్‌కు రైలులో వచ్చిన డివిజనల్ అధికారి ద్వివేది

సామర్లకోట: విజయవాడ డివిజన్ ప్రిన్సిపల్ చీఫ్ సిగ్నల్, టెలికమ్యూనికేషన్స్ ఇంజినీరు జికె ద్వివేది ఆదివారం విండో ఇన్‌స్పెక్షన్ నిర్వహించారు. విశాఖ నుంచి విజయవాడ వరకు 18047 అమరావతి ఎక్స్‌ప్రెస్‌లో ఆయన ప్రతి స్టేషన్‌ను పరిశీలించారు. స్థానిక స్టేషన్‌లో మూడో నంబర్ ప్లాట్‌ఫాంపై ఆయనకు స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ స్వాగతం పలికారు. సీనియర్ సెక్షన్ ఇంజినీర్లు జోగారావు, నారాయణరాజు, చీఫ్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ కిశోర్, జూనియర్ ఇంజినీరు సౌమ్య, ఆర్పీఎఫ్ ఎస్సై ఎస్.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలిస్తే కేసులే

కొత్తపల్లి: మైనర్లకు వాహనాలు ఇస్తే సంబంధిత యజమానులపై కేసు నమోదు చేస్తామని పిఠాపురం సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ తెలిపారు. ఉప్పాడ-కాకినాడ బీచ్ రోడ్డులో ఆదివారం ఆయన పర్యటించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించి అనంతరం వాహనాలు నడుపుతున్న మైనర్ బాలురకు, మద్యం సేవిస్తున్న వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనర్లకు వాహనాలు ఇవ్వడం, మద్యం సేవించి వాహనాలు నడపడం, అతి వేగం, ట్రిపుల్ రైడింగ్ కారణంగానే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రమాదాల నియంత్రణకు వాహన చోదకులు పోలీసులకు సహకరించాలన్నారు. సెలవు రోజుల్లో తీర ప్రాంతానికి పర్యాటకుల తాకిడి కారణంగా ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందన్నారు. పర్యాటకులు తమ వాహనాలను ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా పార్కింగ్ చేసుకోవాలని సూచించారు.

అర్హులందరికీ పథకాలు అందాలి



జగనన్న సురక్షపై శిక్షణ ఇస్తున్న సాయి

సామర్లకోట: అర్హులందరికీ నవరత్న పథకాలు అందేలా చూడాల్సిన బాధ్యత వలంటీర్లు, గృహ సారథులపై ఉందని పట్టణ గృహ సారథుల కన్వీనర్ ఇరుసుమళ్ల సాయి అన్నారు. మున్సిపాలిటీలోని ఆయా సచివాలయాల పరిధిలో ఆదివారం నిర్వహించిన జగనన్న సురక్ష సర్వేలో ఆయన పాల్గొని పలు సూచనలు ఇచ్చారు. జూలై ఒకటి నుంచి అమలు జరిగే ఈ కార్యక్ర మం విజయవంతం కావడానికి ఇప్పటి నుంచే వలంటీర్లు, గృహసారథులు ప్రతి ఇంటికీ వెళ్లి వారి అవసరాలను తెలుసుకోవాలన్నారు. ఈ మేరకు ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న సర్టిఫికెట్లు వాటికి కావలసిన దరఖాస్తులను ముందుగానే తీసుకునేలా ప్రజలను చైతన్యం చేయాలన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడల్లో పల్లవి ప్రతిభ



రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రథమ బహుమతి అందుకుంటున్న పల్లవి

పెద్దాపురం: జిల్లా స్పోర్ట్స్ అథారిటీ హాల్‌లో రాష్ట్రస్థాయి 7వ మోడ్రన్ పెంటాథ్లాన్ చాంపియన్ షిప్-2023 పోటీల్లో పెద్దాపురం మండలం ఆర్బీ పట్నం విద్యార్థిని పల్లవి ఉత్తమ ప్రతిభ కనబరచింది. అండర్-11 కేటగిరిలో మూడు విభాగాల్లో ప్రథమ స్థానం సాధించింది. పెంటాథ్లాన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చప్పిడి వెంకటేశ్వరరావు, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ చీఫ్‌కోచ్ శ్రీనివాసరావు విద్యార్థినికి బహుమతి అందజేశారు.

విద్యుత్ సౌకర్యం కల్పించాలని ఆందోళన



ఆందోళన నిర్వహిస్తున్న కాలనీవాసులు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం వన్నెపూడి తుమ్మ చెరువును ఆనుకుని ఉన్న రెండు కాలనీలకు గత నాలుగేళ్లుగా విద్యుత్ సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నామని కాలనీవాసులు ఆదివారం ఆందోళన నిర్వహించారు. తమ ఇళ్లకు కరెంటు సౌకర్యం కల్పించాలని ఎన్ని విజ్ఞప్తులు చేసినా గ్రామ పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమను ఆదుకోవాలని కోరారు. ఆందోళనలో పలువురు కాలనీవాసులు పాల్గొన్నారు.

ఉరకలేసిన ఉత్సాహం



చంద్రమాంపల్లి హైస్కూల్ పూర్వ విద్యార్థులు

- 50 ఏళ్ల ప్రాయంలో టీనేజీ అల్లర్లు
- సందడి చేసిన 1984-85 బ్యాచ్ విద్యార్థులు
- వేదికగా నిలచిన చంద్రమాంపల్లి హైస్కూల్

పెద్దాపురం: పదిహేనేళ్ల ప్రాయంలో చేసిన అల్లర్లు.. అలకలు.. కొట్లాటలు.. చెట్టాపట్టాలు.. అన్నీ వారి మనసులను ముప్పిరిగొన్నాయి. ఒకరికొకరు తారసపడగానే ఆనంద పారవశ్యంతో నోట మాట రాక పోయినా నాటి ఆ మిత్రుడి మొహం స్మృతిగా, లీలా మాత్రంగా గుర్తొచ్చి ఒక్క క్షణం ఆనంద బాష్పమో, ఎంత పెద్దయిపోయావురా.. ఎలా మారిపోయావురా అనే మౌన పలకరింపులు.. అంతలోనే అసలు పేర్లు వదిలేసి నిక్‌నేమ్స్‌తో పిలుపులు.. కొంటె ప్రశ్నలు, కవ్వింపులు అబ్బో వాళ్ల ఆనందానికి అంతే లేకుండా పోయింది. ఈ హడావిడి అంతటికీ వేదికగా నిలచింది చంద్రమాంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల. 1984-85 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం పాఠశాల ప్రాంగణంలో కలసి సందడి చేశారు. వారి హోదాలు మరచి నాటి ముచ్చట్లలో మునిగి తేలిపోయారు. నాటి గురువులతో పాటు, పాఠశాల అభివృద్ధికి పోరాడిన ఉద్యమకారుడు, ఆజాద్ నేషనల్ ఆర్మీ అధ్యక్షుడు కొత్తెం కోటిలను వారు సత్కరించి ఐక్యతను, ప్రేమాభిమానాలను చాటుకున్నారు.

తొలకరి పిలుపు



గొల్లప్రోలు మండలంలో మిరపతోటలు వేయడానికి భూమిని దుక్కి దున్నుతున్న రైతన్న



గొల్లప్రోలు మండలంలో మిరప నారు నాటుతున్న కూలీలు

పిఠాపురం: తొలకరి పలకరించింది మండుటెండలు తగ్గి మబ్బులు వర్షించి మురిపిస్తున్నాయి. ఖరీఫ్‌కు కర్షకుడు సమాయత్తమయ్యాడు. ఏరువాక సాగిన రైతులు నారుమళ్ల తయారీలో తలమునకలయ్యాడు. ఖరీఫ్‌కు నారుమళ్లతో పాటు వాణిజ్య పంటలకు దుక్కిదున్నడంలో నిమగ్నమయ్యాడు. నియోజకవర్గం వరితో పాటు వాణిజ్య పంటలకు పుట్టినిల్లు కావడంతో పత్తి, మిరప, ఉల్లి, మల్బరీ, పుచ్చ, వంగ, క్యాబేజీ, చిక్కుడు, పెండలం, బీర తదితర వాణిజ్య పంటల సాగుకు రైతులు భూములను, నారుమళ్లను సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే నారు సిద్ధంగా ఉన్న కొన్ని చోట్ల మిరప నాట్లు జోరుగా చేపట్టారు.

మరిడమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు



మరిడమ్మ ఆలయం వద్ద భక్తుల కోలాహలం

పెద్దాపురం: స్థానిక మరిడమ్మ తల్లి జాతర మహోత్సవాల్లో భాగంగా రెండో ఆదివారం ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ రామ్మోహనరావు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేశారు. తాత్కాలిక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సీఐ అబ్దుల్ నబీ పర్యవేక్షణలో ఎస్సై వెలుగుల సురేష్ భారీ బందోబస్తు నిర్వహించారు. సుమారు లక్ష వరకు భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్లు అధికారులు అంచనా.

స్థానిక స్వచ్ఛంద సంఘాల ఆధ్వర్యంలో భక్తులకు ఆదివారం పులిహోర అందజేసారు. స్థానిక వర్షుల వారి వీధిలో భువనేశ్వరి పీఠం అధిపతి చింతా గోపి శర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో భక్తులకు ఉచితంగా పులిహోర పంపిణీ చేశారు.

రైల్వే డ్రైన్‌లో పూడిక తీత



రైల్వే డ్రైన్‌లో పూడిక తీస్తున్న సిబ్బంది

సామర్లకోట: స్థానిక ఫ్లైఓవర్ బ్రిడ్జి నుంచి సత్యనారాయణపురం వరకు ఉన్న రైల్వే డ్రైనులో ఆదివారం పూడిక తీత ప్రారంభించారు. కొన్నేళ్లుగా పూడిక తీయకపోవడంతో వర్షాకాలంలో తరచూ ముంపునకు గురవుతోంది. దీంతో రైల్వే ఉన్నతాధికారుల సూచనలతో స్థానిక రైల్వే అధికారులు పూడిక తీత పనులను ప్రారంభించారు.

పశువుల పాకలో గేదెలు చోరీ

సామర్లకోట: స్థానిక ఉండూరు రైల్వే గేటు సమీపంలోని గండి రామకృష్ణకు చెందిన పశువుల పాకలో ఉన్న గేదెలను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. రామకృష్ణ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. శనివారం రాత్రి పాలు తీసి గేదెలను మకాంలో ఉంచి ఇంటికి వెళ్లానని, ఆదివారం ఉదయం చూస్తే గేదెలు లేవని రామకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రెండు గేదెలు రూ.నాలుగు లక్షల విలువ చేస్తాయని రామకృష్ణ తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రధాని మోదీ తొమ్మిదేళ్ల పాలనపై ప్రచారం



గొల్లప్రోలు నగర పంచాయతీలో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేస్తున్న బీజేపీ నేతలు

పిఠాపురం: భారత ప్రధాని నరేంద్రమోదీ పాలనకు తొమ్మిదేళ్లు పూర్తయిన సందర్భంగా బీజేపీ పార్టీ శ్రేణులు గొల్లప్రోలు నగర పంచాయతీలో ఆదివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ గొల్లప్రోలు నగర పంచాయతీ అధ్యక్షుడు చిట్టా మధు ఆధ్వర్యంలో పలువురు బీజేపీ నేతలు ఇంటింటికీ వెళ్లి బీజేపీ ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రజలకు వివరించారు. ఎన్నో ప్రజా సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తూ ప్రపంచ దేశాలను ఆకర్షించడంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ విజయం సాధించారంటూ వివరించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు బిళ్లకుర్తి రామేశ్వరరెడ్డి, గండి కొండలరావు, దాట్ల సూర్యనారాయణరాజు, కర్రి సత్యనారాయణ, వియ్యపు రాములు, చీపురి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో జైప్రకాష్ ప్రతిభ

కరప: రాష్ట్రస్థాయి చదరంగం పోటీలలో మండలంలోని కూరాడకు చెందిన వనుం జైప్రకాష్ ప్రతిభ చూపి విజేతగా నిలిచాడు. విజయవాడలో ఆదివారం జరిగిన ఫైనల్స్ అండర్-9 విభాగంలో అతడు ప్రథమ స్థానంలో నిలిచాడు. చెస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కేవీవీ శర్మ, సెక్రటరీ భీమారావు విజేత జైప్రకాష్‌కు చాంపియన్‌షిప్ షీల్డును అందజేశారు. జార్ఖండ్‌లో నవంబరులో జరిగే జాతీయ స్థాయి పోటీలలో రాష్ట్రం తరపున అతడు పాల్గొంటాడని నిర్వాహకులు తెలిపారు. జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకె శ్రీలక్ష్మి, సర్పంచ్ వాసంశెట్టి కొండ, పీఏసీఎస్ చైర్మన్ రావుల ప్రసాద్ తదితరులు జైప్రకాష్‌ను అభినందించారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తుని: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా పట్టణ పరిధిలోని ఒకటి నుంచి 10 వార్డుల్లో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఈఈ కె.రత్నాలరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 33 కేవీ కోటనందూరు, 33/11 కేవీ తాండవ సబ్‌స్టేషన్, 11 కేవీ కట్రాళ్లకొండ, 11 కేవీ సీతారాంపురం ఫీడర్ల పరిధిలో డబుల్ జంపరింగ్, రోడ్ క్రాసింగ్ మరమ్మతులు నిర్వహిస్తున్నామన్నారు. దీంతో పట్టణంలోని కొండవారిపేట, టైలర్స్ కాలనీ, అమ్మాజీపేట, సీతారాంపురం, కంకిపాటి వారి గరువు, శ్రీనివాసా సెంటర్, ఆర్టీసీ కాంప్లెక్స్, రెల్లి కాలనీ, డ్రైవర్స్ కాలనీ తదితర ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ప్రజలు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుని సహకరించాలని ఆయన కోరారు.

గొరంపేటలో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్



గొరంపేటలో ఫాగింగ్ చేస్తున్న పంచాయతీ కార్మికుడు

శంఖవరం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని గొరంపేట సర్పంచ్ రామిశెట్టి ఏసుబాబు అన్నారు. మండలంలోని గొరంపేటలో ఆదివారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. సర్పంచ్ ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడిక తీసి బ్లీచింగ్ చల్లారు. వీధుల్లో దోమల నివారణ మందు పిచికారీ చేశారు. గ్రామాన్ని వ్యర్థ రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని సర్పంచ్ కోరారు.

8 మంది జూదరుల అరెస్టు

సామర్లకోట: మండల పరిధిలో ఉండూరు రోడ్డు శివారులో పేకాడుతున్న 8 మందిని సీఐ కె దుర్గాప్రసాద్ అరెస్టు చేశారు. ముందస్తు సమాచారం మేరకు శిబిరంపై తన సిబ్బందితో దాడి చేసి వారి నుంచి రూ.5,400, పేక ముక్కలను సీజ్ చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అవయవ దానంతో పునర్జన్మ

కాకినాడ రూరల్: ప్రపంచ అవయవ మార్పిడి దినోత్సవాన్ని పురస్కరించుకుని అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. దంత వైద్యుడు అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి బతకడం కష్టమని వైద్యులు నిర్ధారిస్తే ఆ దేహం నుంచి 8 రకాల అవయవాలు ఎనిమిది మందికి దానం చేయవచ్చని వివరించారు. అడబాల రత్నప్రసాద్, సత్యనారాయణ, రెడ్నం రాజా తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న లోవరాజు తదితరులు

కాకినాడ కల్చరల్: రెల్లి ఉద్యోగులు సమస్యల పరిష్కారాకి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఆల్ గవర్నమెంట్ రెల్లి ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బంగారు లోవరాజు అన్నారు. స్థానిక గాంధీభవన్‌లో అసోసియేషన్ జిల్లాస్థాయి సమావేశం ఆదివారం లోవరాజు అధ్యక్షతన జరిగింది. ముందుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. పదవీ విరమణ చేసిన పారిశుద్ధ్య కార్మికులకు పెన్షన్ తదితర ప్రయోజనాలను వెంటనే అందజేయాలన్నారు.అనంతరం సమావేశంలో ఏరియా కన్వీనర్లను ఎన్నుకొన్నారు. అసోసియేషన్ కాకినాడ కన్వీనర్‌గా బి.నరసింహారావును, గొల్లప్రోలు కన్వీనర్‌గా మీసాల అన్నవరం, తుని కన్వీనర్‌గా కె.సత్యనారాయణ, ద్రాక్షారామం కన్వీనర్‌గా బంగారు దేవి తదితరులను ఎన్నుకొన్నారు.

మండల పరిషత్ ఏఓ బాధ్యతల స్వీకరణ



చంద్రశేఖర్‌కు స్వాగతం పలుకుతున్న సిబ్బంది

కాకినాడ రూరల్: మండల పరిషత్ పరిపాలన అధికారిగా ఏవీఎస్ చంద్రశేఖర్ ఆదివారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. జెడ్పీ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఆయన పదోన్నతిపై ఇటీవల బదిలీల్లో భాగంగా కాకినాడ రూరల్‌కు బదిలీ అయ్యారు. ఆయనకు కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు.

సప్తస్వర నీరాజనం

- వీనుల విందుగా కచేరీలు
- సంగీతజ్ఞుల నిలయంగా కాకినాడ
- ఉత్సాహంగా ప్రపంచ సంగీతోత్సవాలు



సత్కళావాహినిలో కీర్తనలు ఆలపిస్తున్న సంగీత విద్వాంసుడు డాక్టర్ ఈవీ కృష్ణమాచార్యులు తదితరులు(ఫైల్)

కాకినాడ కల్చరల్: నగరం సప్తస్వర రాగడోలికల్లో ఓలలాడుతోంది. ప్రపంచ సంగీతోత్సవాలు సాగుతున్న వేళ ప్రఖ్యాత సంగీతజ్ఞుల ఆధ్వర్యంలో పలు వేదికలపై కళాకారులు కచేరీలు చేస్తూ ఆహూతులకు, కళాప్రియులకు వీనుల విందు చేస్తున్నారు. నగరంలోని సూర్యకళామందిర్, దంటు కళాక్షేత్రం, సత్కళవాహిని వంటి ఆడిటోరియంలలో సప్తస్వరాలు విన్యాసం చేస్తున్నాయి. నగరంలో సుమారు 50 మందికి పైగా ప్రఖ్యాతిగాంచిన సంగీత కళాకారులు ఉన్నారు. కర్ణాటక సంగీత విద్వాంసురాలు పెద్దాడ సూర్యకుమారి, సత్కళవాహిని వ్యవస్థాపకులు డాక్టర్ ఈవీ కృష్ణమాచార్యులు వంటి ఎందరో సంగీత విద్వాంసులు ఉన్నారు. అలాగే శ్రీరామసమాజం సంగీత కళాశాల, మంజరి సంగీత కళాశాల, సరస్వతీ గాన సభ సంగీత శిక్షణ కేంద్రం, సద్గురు సంగీత కళాశాల, శరణ్య స్కూల్ ఆఫ్ ఆర్ట్స్, విద్యాధరి స్కూల్ ఆఫ్ మ్యూజిక్ తదితర సంగీత కళాశాలలు సుమారు 20 వరకు ఉన్నాయి.

సంగీతంతో మానసిక ప్రశాంతత



సంగీతం మానసిక ప్రశాంతతను, ఏకాగ్రతను పెంపొందిస్తుంది. సంగీతానికి రాళ్లు కరుగుతాయని, వరుణుడు వర్షిస్తాడన్నది నిర్వివాదాంశం. ప్రతీ ఇంటికి ఒక సంగీత కళాకారున్ని తయారు చేసి ఈ కళకు పూర్వవైభవం తీసుకొంచేందుకు కృషి చేస్తున్నా.

– డా.ఈవీ కృష్ణమాచార్యులు, సంగీత విద్వాంసుడు, కాకినాడ

సంగీతంపై మక్కువ పెంచాలి



తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలకు సంగీతంపై మక్కువ పెంచాలి. ప్రతి విద్యార్థీ సంగీతాన్ని సాధన చేయాలి. దీంతో మన సంస్కృతి తరువాత తరాలకు చేరే అవకాశం ఉంటుంది. ప్రస్తు కాలంలో సంగీతానికి ఆదరణ మరింత పెరుగుతోంది.

– ఎస్‌కేడీ వెంకట్రావు, వేణుగాన విద్వాంసుడు, కాకినాడ

మన తర్వాత తరాలకు సంగీతం అందించాలి



సంగీతాన్ని ప్రోత్సహించి అనేక మంది శిష్యులను తయారు చేస్తున్నాను. ప్రాచీన సంగీత కళ అంతరించి పోకుండా మన తర్వాత తరాలకు ఈ కళను బహుమతిగా అందించే ప్రయత్నం చేయాలి. ఈ కళను ఏకాగ్రతతో అభ్యసించాలి. సంగీతం మానసిక ప్రశాతంతను చేకూరుస్తుంది.

– చావలి సూర్యకుమారి, సంగీత విద్వాంసురాలు,కాకినాడ

భారత సంస్కృతికి ప్రతిరూపం



భారత సంస్కృతికి సంగీతం ప్రతిరూపం. ఒక అపూరూప కళగా భావించి భక్తిశ్రద్ధలతో ఏకాగ్రతతో సంగీతాన్ని అభ్యసించాలి. మన సంగీత కళకు దేశ విదేశాలలో నానాటికి ఆదరణ పెరుగుతోంది. భారత దేశానికి ప్రపంచ దేశాలలో గుర్తింపు తెచ్చిన అంశాల్లో సంగీతం ఒకటని గుర్తించాలి. – పెద్దాడ సూర్యకుమారి, కర్ణాటక సంగీత విద్వాంసురాలు,కాకినాడ.